బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

సమస్యల ఎజెండా లేని ఎన్నికలు

డెబ్బై ఐదేండ్ల స్వాతంత్ర్య భారతంలో అన్ని రాష్ట్రాల ఎన్నికల చరిత్రలో ప్రతిసారి తాగునీరు, విద్యుత్తు సమస్యలు ఎన్నికల ఎజెండాలుగా సాంప్రదాయంలా వస్తున్నాయి. ప్రస్తుత 5 రాష్ట్రాల ఎన్నికల్లోనూ తెలంగాణ మినహా అన్నిచోట్ల ఇవే ఎజెండాలో ఉన్నయి. కానీ దేశ చరిత్రలో మొదటిసారి తెలంగాణ ఎన్నికల్లో తాగునీరు, విద్యుత్తు సమస్యలు ఎజెండాలుగా లేవు.

దశాబ్దకాలంగా రాష్ట్రాన్ని పాలిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలో తాగునీరు, విద్యుత్తు సమస్యలను రూపుమాపి దేశానికే తలమానికంగా నిలిచింది. ఈ రెండు ప్రజా జీవనానికి నిత్యావసరాలు. తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చి శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తున్నది. దీని కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.44 వేలకోట్లు ఖర్చు పెట్టి, కృష్ణ గోదావరి జలాలను వినియోగంలోకి తెచ్చి రాష్ట్రంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా రూపుమాపింది.

తెలంగాణ రాకముందు ఊర్లల్లో నీళ్లులేని కారణంగా పిల్లనిస్తే బాయిల దగ్గరనుంచి నీళ్లు మోపిస్తరనే కారణాలతో కొన్ని ప్రాంతాలకు ఆడపిల్లనియ్యని దుస్థితిని చూశాం, నులక మంచం కింద తాంబాలం పెట్టి మంచం పైన స్నానం చేసి తిరిగి ఆ నీటిని ఇతర అవసరాలకు వాడే దీన స్థితిని నారాయణ ఖేడ్ పరిసరాల్లో చూశాం. సరైన నీటి వసతి లేక వర్షాకాలంలో విషజ్వరాలుసోకిన అనారోగ్య పల్లెల్ని చూశాం. నల్గొండ జిల్లా ఫ్లోరైడ్ బాధితుల అవస్థలను చూశాం. వాటన్నింటికీ చెక్ పెట్టింది కేసీఆర్ మిషన్ భగీరథ.

ఇక విద్యుత్తు విషయానికొస్తే అన్ని వర్గాలకు నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరా చేసే ఏకైక రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒక్కటే. ఈ ఆధునిక యుగంలో విద్యుత్తు ఒక మౌలిక వసతి, నిత్యావసరం. వ్యవసాయానికి ఉపాధికి, టూరిజానికి, ప్రొడక్టివిటీకి, ఐటీకి ఇలా అన్ని రంగాలకు ఇంధనం విద్యుత్తు.

అభివృద్ధి చోదక శక్తి విద్యుత్తు. అటువంటి విద్యుత్తు విషయంలో కేసీఆర్ ప్రభుత్వం సాధించిన విజయాలు దేశానికే ఆదర్శం. రాష్ట్ర తలసరి విద్యుత్తు వినియోగంలో 1196 యూనిట్స్ నుంచి 2166 యూనిట్స్‌కు ఎగబాకింది. దేశానికి అవసరమైన డిమాండ్‌ను సైతం సప్లయి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది. గత మార్చిలో విద్యుత్తు 15497 వేల మెగావాట్ల పీక్ డిమాండ్‌కు చేరుకున్నది. తెలంగాణకు ఇప్పుడు విద్యుత్తు సమస్యే కాదు. అలాగే ఎన్నికల ఎజెండాలో కూడా లేదు. కాంగ్రెస్ పాలన వస్తే మళ్లీ పాతరోజులు వస్తాయని భయపడడానికి వాటిని ఎన్నికల్లో ప్రస్తావించడానికి కారణం కాంగ్రెస్ నాయకుల మాటలే కానీ విద్యుత్ సమస్య కాదు.

ఆర్థిక బలంతో సంబంధం లేకుండా ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పం, రైతులు, ప్రజలపైన ప్రేమ ఉంటేనే ఇది సాధ్యమౌతుంది. ఆర్థికంగా బాగానే ఉన్నా కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్రలు కూడా అన్నివర్గాలకు 24 గంటల నిరంతర విద్యుత్ ఇవ్వలేకపోతున్నాయి. కారణం అక్కడి పాలకుల్లో కొరవడిన చిత్తశుద్ధే.

ఈ ఎన్నికలు చారిత్రాత్మకం. దశాబ్దాలుగా ఎన్నికల ఎజెండాగా ఉన్న సమస్యలు కనుమరుగవడం ఎలా సాధ్యపడిందని దేశమంతా ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తున్నది.

పాశం రఘునందన్ రెడ్డి
72077 70469

అబద్ధాల మాటలకు ఆగం గావొద్దు!

దశాబ్దాలుగా తెలంగాణలోని అనర్థాలకు,అక్రమాలకు,అన్యాయాలకు కారణభూతమైన కాంగ్రెస్ కల్లబొల్లి మాటలతో ప్రజల ముందుకొస్తున్న వైనం వారి తెంపరితనాన్ని తలపిస్తున్నది. ప్రధానంగా కాంగ్రెస్ ప్రస్తావిస్తున్న ఆరోపణల్లో అవినీతి ఒకటి. అయితే కాంగ్రెస్ అవినీతి బాగోతాలను 2019 ఆగస్టు 22న జీన్యూస్ ప్రసారం చేసింది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నెహ్రూ మొదలు మన్మోహన్ సింగ్ వరకు 2జీ స్పెక్ట్రమ్, కామన్వెల్త్ గేమ్స్ స్కాం, బొగ్గు కుంభకోణం,హెలికాప్టర్ల కుంభకోణం ఏ టూ జడ్ అవినీతిలో ఆరితేరినవారే. ఆ అనుభవంతో పాలకులందరూ కాంగ్రెస్ లాగానే ఉంటారనే భావంతో నిస్సిగ్గుగా తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం బిగజారుడు రాజకీయాలకు పరాకాష్ఠ.

దేశంలో జరిగిన అవినీతి కార్యాకలాపాల్లో గాంధీ కుటుంబం పాత్ర లేదని చెప్పగలరా? తెలంగాణలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ప్రవచిస్తున్న కాంగ్రెస్‌కు అసలు ప్రజాస్వామ్యం అంటే అర్థం తెలుసా? 'కాంగ్రెస్ అంటేనే ఎమర్జెన్సీ..ఎమర్జెన్సీ అంటేనే ఇందిరా కాంగ్రెస్' అనే కాలంలో ఎమర్జెన్సీ విధించి పౌరహక్కులను హరించి, పత్రికలపై సెన్సార్‌షిప్ అమలు పరచడమే కాకుండా లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్ మొదలుకొని ప్రతిపక్ష పార్టీ నేతలను స్వాతంత్ర్య సమరయోధులను, ప్రజాస్వామికవాదులను జైళ్లలో కుక్కిన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకాన్ని ఆ పార్టీ నేతలు గుర్తుచేసుకుంటే మంచిది. దశాబ్దాల చరిత్రలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు చేసిన మేలు ఏమీ లేకపోయినా ద్రోహాల చిట్టా చాంతాడంత పొడుగు ఉంటుంది.

తెలంగాణలో కేసీఆర్ పాలనను కుటుంబపాలన అనటం హాస్యాస్పదం. ఈ రోజు పదవుల్లో ఉన్న కేసీఆర్ కుటుంబీకులంతా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవారే. కేసులు, నిర్బంధాలు ఎదుర్కొన్నవారే. ప్రజల ఆమోదంతో భారీ మెజారిటీతో ఎన్నికైన వారే. మరి ఇందిరా కుటుంబం మాటేమిటి? 75ఏండ్లుగా కాంగ్రెస్‌ను శాసిస్తున్నది ఆ ఒక్క కుటుంబం కాదా? ఇందిరా ఆధిపత్యాన్ని ప్రశ్నించిన పాపానికి నిజలింగప్ప, కామరాజ్ నాడార్, మొరార్జీ దేశాయ్ వంటి సీనియర్ కాంగ్రెస్ దిగ్గజాలను ఇందిరమ్మ శంకరగిరి మాన్యాలు పట్టించలేదా? రాష్ట్రపతిగా పోటీచేసిన సొంత పార్టీ అభ్యర్థి నీలం సంజీవరెడ్డిని ఇందిరాగాంధీ వెన్నుపోటుతో ఓడించలేదా? అంతెందుకు ఒక సాధారణ లోకసభ సభ్యుని హోదాలో హైదరాబాద్‌కు వచ్చిన రాజీవ్‌గాంధీని స్వాగతించడానికి వచ్చిన సీఎం అంజయ్యను బేగంపేట విమానాశ్రయంలోనే అవమానించి ఆ తర్వాత ఉద్వాసన పలుకలేదా? ఇది కుటుంబ పెత్తనం కాక మరేమిటో వివరణ ఇవ్వాలి.

సోనియాకు ఇష్టం లేకనే కదా మాజీ ప్రధాని పీవీ మరణిస్తే ఢిల్లీలో కనీసం ఆరడుగుల నేల దొరుకలేని స్థితి. అది కుటుంబ దాష్టీకం కాదా? అంతదాకా ఎందుకు ఎంతమంది ముఖ్యమంత్రుల కుటుంబాలు రాజకీయాల్లో లేవు? పీవీ, చెన్నారెడ్డి, నాదెండ్ల, కోట్ల, వై.ఎస్, కిరణ్ కుటుంబాలు రాజకీయాల్లో చక్రం తిప్పలేదా? ఎన్టీఆర్ ఇద్దరు అల్లుండ్లు, ఇద్దరు కొడుకులు, కూతురు, మనువడు, మనువరాలు రాజకీయాల్లో లేరా? అటువంటిది కేసీఆర్‌ది కుటుంబ పాలన అనడానికి మీకు నోరెలావస్తుంది. కాంగ్రెస్ పెద్దలకు ఏ మాత్రం నిజాయితీ ఉన్నా చేసిన పాపాలకు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పుకోవాలె, కానీ అబద్ధాలతో తెలంగాణ ప్రజలను నమ్మించలేరు.

తెలంగాణలో ఉద్యోగాలే రాలేదన్న అభాండం ఒకటి. ఈ ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత దాదాపుగా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసింది. పంచాయతీ సెక్రటరీలు, విద్యుత్ శాఖ, గురుకులాల టీచర్స్, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, పోలీస్ శాఖ, సింగరేణి వివిధ డిపార్ట్‌మెంట్‌లలో అర్హత గల కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులర్ చేయడం జరిగింది.

గతంలోకి వెళ్తే తెలంగాణ నిరుద్యోగులకు వరప్రదాయిని అయిన ముల్కీ నిబంధనలు ఉండాల్సిందేనని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ విరుద్ధంగా రాజ్యాంగ సవరణతో ఆ తీర్పును రద్దుచేసి తెలంగాణ నిరుద్యోగుల నోట మట్టి కొట్టింది కాంగ్రెస్ కాదా? తెలంగాణకు న్యాయంగా చెందాల్సిన రెండు లక్షల ఉద్యోగాలు అన్యాక్రాంతమైనట్లు తేల్చిన గిర్‌గ్లాని కమిషన్ నివేదికను తుంగలో తొక్కింది ఎవరు? నాటి పెద్దమనుషుల ఒప్పందాలు, ఆరు సూత్రాల పథకాలు, 610జీవోలు అటకెక్కించిన ఘనత కాంగ్రెస్ ది కాదా?

దేశాన్ని 54 ఏండ్లు , ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌ను 42ఏండ్లు పాలించిన కాంగ్రెస్ తన గతం మరిచి ఇలా సుద్దులు, బుద్ధులు చెప్పడం ఆశ్చర్యమే అనిపిస్తుంది. అధికారం కోసమే అబద్ధాలు వల్లిస్తూ, దింపుడు కల్లం ఆశతో ముందుకొస్తున్న కాంగ్రెస్ పట్ల అప్రమత్తంగా ఉంటే మంచిది.

డాక్టర్ సంగని మల్లేశ్వర్
98662 55355

తెలంగాణ ప్రాణం తీసిందే కాంగ్రెస్

విశాలాంధ్ర పేరుతో తెలంగాణను ఆంధ్రలో విలీనం చేసి ఆర్థికంగా బలంగా ఉన్న తెలంగాణను ప్రాణం తీసిందే కాంగ్రెస్. నిజాంకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసిన 4 వేల మందిని భారతీయ సైన్యం పేరుతో చంపించింది కూడా కాంగ్రెస్. స్వరాష్ట్రం అడిగినందుకు 1969లో కాసు బ్రహ్మానంద రెడ్డి ప్రభుత్వం 400 మంది తెలంగాణ బిడ్డలను కాల్చి చంపింది.

తెలంగాణ రాష్ట్రం కావాల్సిందే అని పోరాడినందుకు మలి దశ ఉద్యమంలో 1200 మంది యువకుల ఆత్మహత్యలకు కారణమైంది కూడా కాంగ్రెస్ పార్టీనే. ప్రజల కోసం పోరాడుతున్న నక్సలైట్లను చర్చల పేరుతో అడవుల నుంచి బయటకు పిలిచి..వందల మందిని కాల్చి వేసింది కూడా కాంగ్రెస్ పార్టీనే.

గారడీ మాటలు, పతరాలేని వ్యాఖ్యలతో ముందుకు వస్తున్న కాంగ్రెస్ 60 ఏండ్ల చరిత్ర ప్రజలకు తెలియనిది కాదు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు నుంచే ప్రారంభమైన కాంగ్రెస్ ద్రోహం 2014 వరకు కొనసాగింది. తెలంగాణ ప్రజల వాస్తవ అభిప్రాయాలను గౌరవించకుండా నాటి నెహ్రూ ప్రభుత్వం తెలంగాణను బలవంతంగా ఆంధ్రలో విలీనం చేయడం కాంగ్రెస్ తొలిద్రోహం. అంతటితో ఆగకుండా ఇక్కడ కొనసాగుతున్న సాయుధ రైతాంగ పోరాటంపై నెహ్రూ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. సైనికచర్య పేరుతో వేలాదిమంది తెలంగాణ ఉద్యమకారులను సైన్యం ఊచకోత కోసింది. పెద్ద మనుషుల ఒప్పందం, ముల్కీ ఒప్పందాలను కాంగ్రెస్ నేతలు పట్టించుకోలేదు. 1969లో వచ్చిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంపై ఉక్కుపాదాన్ని మోపింది కూడా కాంగ్రెస్ పార్టీనే. ఇందిరమ్మరాజ్యం తెస్తామంటున్న నేటి తెలంగాణ కాంగ్రెస్ నేతలు నాడు ఇందిరమ్మ చేసిన ద్రోహాన్ని ఒక్కసారి గుర్తుకుతెచ్చుకోవాలి.

ఇక మలిదశ ఉద్యమంపై కాంగ్రెస్ ధోరణి అంతా మోసపూరితమే. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నాయకత్వంలో పోరాటం కొనసాగుతుంటే..9 ఏండ్లుగా అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ..అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం 2004లో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి టీఆర్ఎస్‌తో పొత్తుపెట్టుకొని అధికారాన్ని చేపట్టింది. తెలంగాణ అంశాన్ని కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో పెట్టిన కాంగ్రెస్ రాష్ట్ర ఏర్పాటు దిశగా ఒక్కఅడుగు కూడా ముందుకు వేయలేదు.

వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా తెలంగాణకు అన్యాయం చేసే నిర్ణయాలు తీసుకుంటుంటే తెలంగాణ కాంగ్రెస్ నేతలు మాత్రం తమకు అధికారమే ముఖ్యమన్నట్లుగా వ్యవహరించారు. మలిదశ ఉద్యమంలో కాంగ్రెస్ ద్రోహం వల్ల 1200 మందికిపైగా తెలంగాణ బిడ్డలు ఆత్మహత్యలు చేసుకున్నారు. కేసీఆర్ ఆమరణ దీక్ష, తెలంగాణ వ్యాప్తంగా వచ్చిన ప్రజా ఉద్యమం ఫలితంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించింది. తెలంగాణ ప్రకటన సమయంలో కూడా అనేక అడ్డంకులు కల్పించింది కూడా కాంగ్రెస్ పార్టీనే.

ఇక రాష్ట్ర ఏర్పాటు తర్వాత రాష్ట్రం తెచ్చిన పార్టీకే తెలంగాణ ప్రజలు పట్టం కట్టారు. తెలంగాణను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వ పథకాలను రూపొందించడం..వాటిని అమలు చేయడం ప్రారంభించారు. ఎప్పుడైతే తెలంగాణ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అడుగులు వేయడం ప్రారంభించిందో..అప్పుడే అభివృద్ధిని అడ్డుకోవడానికి కుట్రలు చేసింది కూడా కాంగ్రెస్ పార్టీనే.

బండారు జితేందర్
93912 94127

తాజా ఎన్నికల నేపథ్యంలో 60 ఏండ్లలో సాధించలేనిది, ఇప్పుడు అధికారమిస్తే అందిస్తామని మాయచేస్తున్నది. పతరాలేని 6 గ్యారెంటీలను చెప్తూ..కర్ణాటక మాడల్‌ను రుద్దాలని చూస్తున్నది. కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలు, నీటి కొరతలు, ముఖ్యమంత్రుల మార్పు తప్ప మరేం ఉండదు. అందుకే 60 ఏళ్ల మోసాలను యాది చేసుకొని కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాల్సిన సమయమిది. అభివృద్ధికి పట్టం కట్టాల్సిన సందర్భం ఇది!

తెలంగాణపై ఢిల్లీ దండు దాడి

ఈ ఎన్నికల్లో ఒక దృశ్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. తెలంగాణ స్థానిక నాయకత్వం ఒకవైపు, జాతీయ పార్టీల నాయకుల దండు ఒకవైపు. ఇక్కడ తెలంగాణ స్థానిక నాయకత్వమంటే తెలంగాణ ఆత్మను ఆవాహనం చేసుకొని తెలంగాణ వాదాన్ని భుజాన మోస్తున్న పూర్వపు టీఆర్ఎస్, నేటి బీఆర్ఎస్. జాతీయ నాయకత్వమంటే జాతీయ పార్టీల నాయకులు, తెలంగాణలో వారి కనుసన్నలలో మెలిగే తాబేదార్లు. వారి పొత్తు పార్టీలవారు.

ఒకే ఒక్కడైన కేసీఆర్‌ను, ఒక్కటైన బీఆర్ఎస్‌ను మట్టు పెట్టడానికి జాతీయ పార్టీల అధిష్ఠానాలు తెలంగాణపై ఒక యుద్ధమే చేశాయి. కేసీఆర్‌ను ఎదుర్కొవటం తమ వల్ల కాదని ఆయా పార్టీల స్థానిక నాయకులు చేతులెత్తేయటంతో జాతీయపార్టీల నాయకత్వమంతా తెలంగాణపై దాడికి దిగింది.

కాంగ్రెస్ నుంచి వారి అధిష్ఠానదేవత మొదలు ఆమె కుమారుడు, కుమార్తె, వారి మానస పుత్రులైన ఆపార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు తెలంగాణపై దండెత్తి వచ్చారు. ఇక బీజేపీ నుంచైతే ప్రధాని మోదీ, హోంమంత్రి, పార్టీ జాతీయ నాయకులు, కేంద్రమంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పొత్తు పార్టీల చోటామియా, బడేమియాలు వచ్చి తెలంగాణను చుట్టుముట్టి కేసీఆర్ ప్రభుత్వంపై ముప్పేట దాడిచేశారు.

తెలంగాణలోని జాతీయ పార్టీల స్థానిక నాయకత్వాలను ప్రజలు విశ్వసించరని, వారు చెప్తే ప్రజలు నమ్మరని వారి అధిష్ఠానాల పెద్దలే హామీలు ఇచ్చారు. వారే డిక్లరేషన్లు ప్రకటించారు. ఇలా హామీలను, డిక్లరేషన్‌లను కూడా ఢిల్లీ పెద్దలచే చెప్పించే ఆయా పార్టీల స్థానిక నాయకత్వాలు రేపు ఎన్నికల్లో ఒకవేళ గెలిస్తే తిరిగి ఢిల్లీ పెద్దల అనుమతుల కోసం ఎదురు చూడాల్సిందే. ఒక్క మాటలో చెప్పాలంటే రాష్ట్రప్రభుత్వ స్టీరింగ్ ఢిల్లీ అధిష్ఠానాల చేతుల్లో ఉంటుంది. ఇది తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పెద్దల ముందు సాగిలపరచటం కాదా. తెలంగాణ ప్రజల మనోభావాలను కించపరచడం కాదా.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించిన నిరుద్యోగ డిక్లరేషన్, బీసీ డిక్లరేషన్, మైనారిటీ డిక్లరేషన్, ఆరు గ్యారెంటీలు, ఎన్నికల మేనిఫెస్టోలను ఎవరు ప్రకటించారో, ఎవరు విడుదల చేశారో, అలాగే బీజేపీ వారి హామీలను ఎవరు ఇచ్చారో కూడా చూశాం కదా. అంతెందుకు ఎన్నికల్లో పోటీ చేయాల్సిన అభ్యర్థుల జాబితాలను ప్రకటించడానికి కాంగ్రెస్, బీజేపీలకు ఎన్ని రోజుల సమయం పట్టిందో చూశాం. నామినేషన్ల దాఖలుకు చివరిరోజు వరకు అభ్యర్థులను ప్రకటించిన జాతీయ పార్టీల తీరుతెన్నులను చూశాం.

ఇక ఎన్నికల హామీల పరంపర ప్రజలపై ప్రత్యక్ష పరోక్ష పన్నుల భారం మోపటమో, వీలున్నంతవరకూ రకరకరకాల అప్పులుతేవటమో, ప్రభుత్వ ఆస్తులను తెగ నమ్మటమో చేసేలా ఉన్నాయి. కాంగ్రెస్ హామీల పరంపర చూస్తే ఏడాదిలో అమలు చేయాల్సిన హామీల కోసం రెండేండ్ల బడ్జెట్ కూడా సరిపోదు అన్నట్టుగా ఉన్నది.

జాతీయ పార్టీలు తమ హామీలతో తెలంగాణ ప్రజలను మభ్యపెట్టాయి. తమ దాడినంతా కేసీఆర్ పైనే కేంద్రీకరించి విమర్శలు చేశాయి. దేశంలో ఏ చట్టమూ చెప్పని అంగీకరించని చర్యలు తీసుకుంటామని వాచాలత్వం ప్రదర్శించాయి. ఉద్యోగ నియామకాల విషయాల్లోనూ అవాస్తవాలు సత్య దూరమైన ప్రచారాలు, విమర్శలు చేశాయి. ప్రాజెక్టుల విషయంలోనూ పసలేని ఆరోపణలే. ఇక కాంగ్రెస్ చెప్పే ఆరు గ్యారెంటీల అమలుకు ఎన్నికోట్లు అవుతుందో కూడా ఆ పార్టీకి అవగాహన లేదు. అలాగే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు హామీల అమలు సాధ్యమయ్యేదేనా?

ఒకపక్క బక్కపలుచని కేసీఆర్ ఒక్కడిని చేసి ఢిల్లీ నుంచి వచ్చిన నాయకులు మిడుతల్లా ముప్పేట దాడి చేశారు. మరోపక్క అలవి కానీ, ఆచరణ సాధ్యం కానీ హామీలు కుప్పించి ప్రజలని మా యోపాయం చేశారు. కానీ, ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కడే నెలరోజుల్లో రాష్ట్రమంతా తిరిగి తమ ప్రభుత్వం ఏం చేసింది. మళ్లీ గెలిస్తే ఏం చేస్తుం దో సవివరంగా వివరించారు.

నేడు ఓటు వేయబోతున్న తెలంగాణ ప్రజానీకం తమ భవిష్యత్తు భద్రత గురించి సరైన నిర్ణయం తీసుకోవాలి. స్థానిక పార్టీని, నాయకత్వాన్ని బలపరిచేలా ఆ నిర్ణయం ఉంటుందని ఆశిద్దాం.

కె ఎస్ ఎన్ ప్రసాద్
94925 22089

75 ఏండ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఈ దేశాన్ని ఇంతకాలం పాలించిన కాంగ్రెస్, బీజేపీలు బడుగు, బలహీన వర్గాలను తమ ఓటు బ్యాంకుగా వాడుకున్నాయే తప్ప, ఏనాడూ ఆ వర్గాల ప్రగతి కోసం పాటుపడలేదు. ప్రస్తుత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ బీసీలకు అన్యాయం చేసింది. ఇక బీజేపీ టికెట్ల విషయంలో బీసీలకు పెద్దగా ఒరగబెట్టిందేమీ లేదు. అదే సమయంలో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ బీసీలకు అత్యధికంగా సీట్లిచ్చి అవకాశాలు కల్పించింది.

బీఆర్ఎస్‌తోనే బీసీలకు న్యాయం

బీసీ ప్రధానినని ప్రగల్భాలు పలికే నరేంద్రమోదీ బీసీలకు చేసిందేమీలేదు. దేశ జనాభాలో 50 శాతానికి పైగా బీసీలున్నప్పటికీ, 75 ఏండ్ల స్వతంత్ర భారత చరిత్రలో వారికోసం ఒక మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేయలేదు. ఇది ఈ దేశాన్ని ఇప్పటి వరకూ పాలించిన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల అప్రజాస్వామిక వైఖరికి, అణచివేత ధోరణికి నిదర్శనం. బీసీలకు సంక్షేమ మంత్రిత్వశాఖ ఉన్నట్టయితే బీసీల సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి ఉంటుందని, పరిష్కారానికి ఒక అధికారిక వేదిక ఉంటుందని బీఆర్ఎస్ పార్టీ మొదటినుంచి భావిస్తున్నది. అందుకే, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కేంద్రంలో బీసీ సంక్షేమ మంత్రిత్వశాఖ అవసరాన్ని కేంద్రానికి పలుమార్లు గుర్తు చేస్తూ, డిమాండ్ చేశారు.

దేశంలో మెజారిటీ సంఖ్యలో ఉన్న బీసీల కుల గణన చేయకుండా, బీసీ వర్గాల అభివృద్ధిని పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నది. కేంద్ర విధానాలతో విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు న్యాయం జరుగటం లేదు. ఈ నేపథ్యంలోనే తగిన వివరాలు లేకుండా ఏ వర్గాన్నయినా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు ఎలా రచిస్తారంటూ తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రశ్నించిన తీరు ఆలోచింపదగినది.

ప్రజల సమగ్ర వివరాలు విధానకర్తలకు, సామాజిక పరిశోధకులకు ఉపయోగపడాలి. ఏయే ప్రాంతాల్లో, ఏయే వర్గాల సామాజిక, ఆర్థిక పరిస్థితి ఏ విధంగా ఉన్నదో తెలియకుండా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడమంటే చీకట్లో బాణం వేసినట్లే ఉంటుంది. సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలున్న మన సమాజంలో గణాంకాలకు మరింత ప్రాధాన్యం ఉంటుంది. కేంద్రం కులాలవారీ జనగణన అవసరాన్ని గుర్తించాలి. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వ విధానాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. కేంద్రం బీసీ జనగణన జరపనంత వరకు బీసీలకు ఇలాగే తీరని అన్యాయం జరుగుతుంటుంది. ఇందుకు బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఇప్పటికైనా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కండ్లు తెరిచి, తక్షణమే బీసీ వర్గాల జనగణనను చేపట్టాల్సిన అవసరం ఉన్నది. అప్పుడే ఈ దేశంలోని బీసీలకు జనాభా దామాషా ప్రకారం ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అంది, కొంతలో కొంతైనా న్యాయం జరుగుతుంది.

పీ.ఎల్.శ్రీనివాస్
73374 01177

నిత్య కల్యాణం పచ్చతోరణం!!

కష్టానికి వడగండ్ల వానలా
రేపు ఓటమి పాలయ్యేవారే
విపరీత వాగ్దానాలను కురిపిస్తరు
భుజం నిండా బాణాలున్నా
కర్ణునిలా కుంగిపోవడం తెలువక

సముద్రంల నీళ్లన్నీ
పాలమూరు దుక్కమే తెలంగాణ కన్నీళ్లే
పుడితే ఏడుపే, పెళ్లికి ఏడుపే,
సావుకు ఏడుపే,కర్మకాండకు ఏడుపే
నీవు నిలబడ్డకాడనే నీళ్ళుండటం విజయం
కాదంటవా?

ఏ పాలం చూసినా
కొట్టేసిన అడవిలాగుండేది
ఏ ఇల్లు చూసినా లాకౌట్‌లా
తలుపులు మూసే ఉండేవి
పరాయిగడ్డమీద కూలికి పానం పాయే
కూసున్నకాడనే ఇంత కూలి దొరుకుతున్నది
పాలానికి ఆపద్బంధువులా రైతుబంధొస్తున్నది
అవ్వయ్యకు ఆసరా పింఛనొస్తున్నది

ఎరువులకు క్యూ లేదు
బిడ్డ పెండ్లికి బరువు లేదు
ముసలోల్ల తిప్పలు లేవు
ఒంటరి చెల్లె దిగులు లేదు
గీత, బీడీ, చేనేత కన్నీళ్ళు తుడిచిన
కార్తీక పున్నమి వెలుగులకు పదేండ్లు

కాలం సాగుతుంటది కాలువ ప్రవహిస్తుంటది
రాత్రి పగలులా సంక్షేమం నడుస్తుంటది
రైతు నాగలిని మరువడు
అమ్మ బిడ్డ ఆకలి మరువదు
రుతువులు గతితప్పవు అభివృద్ధి నావ ఆగదు
యాదాద్రి నరసింహుడి అభయం ఆగదు

ఎత్తిన ఉద్యమ జెండా ఎగురుతూనే ఉండాలి
పునర్నిర్మాణంలో కాడిని బించొద్దు
తెలంగాణకు జై కొట్టడానికి నోట్ల
పుండ్లైనోళ్లు
డబ్బాలు మోగిస్తున్నరు మోసాలతో
ఊదరగొడ్తున్నరు
మన ఓటు తెలంగాణ కుండాలి
అమరుల త్యాగాలు గెలువాలి ఫలించాలి
నిత్య కల్యాణం పచ్చ తోరణం!! మన
తెలంగాణ

వనపట్ల సుబ్బయ్య
94927 65358